క్లుప్తంగా

నేడు నగరపాలక సంస్థలో స్పందన

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయాల్లోనూ ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందని, అక్కడ పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమకు అర్జీలు అందజేయవచ్చని ఆమె సూచించారు.

యథావిధిగా తాగునీటి సరఫరా

నెహ్రూనగర్: నగరంలో ఆదివారం ఉదయం నుంచి యథావిధిగా తాగునీటి సరఫరా చేస్తున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలియజేశారు. నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి లక్ష్మీపురం (హెచ్ఎల్ఆర్) వాటర్ ట్యాంకులకు 800 ఎంఎం డయా పైపులైన్ స్థానంలో 900 ఎంఎం డయాపైపులైన్ అనుసంధాన పనులు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. తూర్పు నియోజకవర్గానికి సంబంధించి సంగంజాగర్లమూడి నుంచి నగరానికి నీరు సరఫరా చేసే పైపులైన్పై ఏర్పడిన లీకులకు శనివారం పూర్తి చేయడంతో ఆదివారం ఉదయం నుంచి యథావిధిగా నగరంలో నీటి సరఫరా చేసినట్లు వివరించారు.

నేటి నుంచి జాతీయ సైన్స్ దినోత్సవ సంబరాలు

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆధ్వర్యంలో సోమ, మంగళవారాల్లో వివిధ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు జి. శాంతమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతరిక్ష విజ్ఞాన అవగాహన కార్యక్రమంలో భాగంగా ఇటీవల వివిధ పాఠశాలలు, కళాశాలల్లోని వందలాది మంది విద్యార్థులకు రాకెట్ సైన్స్పై అవగాహన కల్పించామని వివరించారు. తాజాగా సోమ, మంగళవారాల్లో విద్య, విజ్ఞాన రంగాల్లో ఇస్రో పాత్రపై శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

సైక్లిస్ట్ రాంబాబుకు ఆర్థిక సాయం



గుంటూరు మెడికల్: యాక్సిడెంట్లో రెండు కాళ్లు పోగొట్టుకుని గుంటూరు జీజీహెచ్ ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో చికిత్స పొందుతున్న సైక్లిస్ట్ బండి రాంబాబుకు ఆదివారం సైక్లిస్ట్ బండ్లమూడి సుబ్బయ్య రూ.1,10,500 ఆర్థిక సాయాన్ని అందించారు. ఆస్పత్రికి వెళ్లి రాంబాబు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి సాయమందించారు. ఈనెల 12న సైక్లింగ్కు వెళ్లిన రాంబాబును గోరంట్ల హోసన్న మందిరం సమీపంలో వెనుక నుంచి వస్తున్న లారీ గుద్దడంతో అతని రెండు కాళ్లు తీసివేశారు. దీనికి సంఘీభావంగా గుంటూరు సైక్లిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయమందించారు. కార్యక్రమంలో జయకర్, వెంకటరమణ పాల్గొన్నారు.

ఆన్లైన్ మోసంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఆన్లైన్ మోసంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనివాసరావుపేట 8వ లైనుకు చెందిన కొత్తకోటి నరేంద్రకుమార్ ఐటీసీలో సాఫ్ట్వేర్ ఇంజినీర్గా పని చేస్తుంటారు. కొద్ది రోజుల కిందట ఓ వ్యక్తి ఆయనకు ఫోన్ చేసి ఆన్లైన్లో ఈజీగా మనీ సంపాదించవచ్చని చెప్పాడు. లింక్ పంపి, చెల్లించే డబ్బుకు ప్రతిసారి అదనంగా కొంత లాభం చేకూరుతుందని ఆశ చూపాడు. రెండుసార్లు నరేంద్రకుమార్ పంపిన డబ్బుకు అదనంగా లాభాన్ని కలిపి చూపించాడు. అనంతరం చెల్లించిన డబ్బులకు లాభం ఇవ్వక పోగా సాంకేతిక కారణాల వల్ల ఫ్రీజ్ అయ్యాయని నమ్మించాడు. మరికొంత చెల్లిస్తే మొత్తం డబ్బులు, లాభం తిరిగి చెల్లిస్తామని చెప్పడంతో నరేంద్రకుమార్ మోసాన్ని గ్రహించాడు. తాను పలు విడతలుగా రూ. 1,41,000 మోసపోయినట్లు గుర్తించి, ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లాలుపురంలో చోరీ

గుంటూరు రూరల్: ఇంటి తాళాలలు పగలగొట్టి లోనికి ప్రవేశించిన దుండగులు బీరువాలో నగదు, నగలు చోరీ చేసిన ఘటన ఆదివారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ బి శ్రీనివాసరావు కథనం ప్రకారం.. లాలుపురం గ్రామానికి చెందిన తన్నీరు చిన్నమస్తాన్రావు కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 22న ఉదయం ఇంటికి తాళాలు వేసి హైదరాబాద్ వెళ్లాడు. అనంతరం ఆదివారం మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. తాళాలు పగలగొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్ళి చూశాడు. బీరువా తాళాలు పగ గొట్టి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు బాధితుడి నుంచి వివరాలు సేకరించారు. బీరువాలో ఉన్న రూ.70 వేల నగదు, నగలు అపహరణకు గురయ్యాయని బాధితుడు చెప్పారు.

లక్ష్మీపురం మెయిన్ రోడ్డులో ఆక్రమణలు

- ట్రాఫిక్కు ఇబ్బందులు
- కన్నెత్తి చూడని పట్టణ ప్రణాళిక విభాగం



బేకర్స్ ఫన్ ఎదుట రోడ్డు మలుపులో ఆక్రమణలు

గుంటూరు ఎడ్యుకేషన్: నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటున్న ఆ రోడ్డుపై ఆక్రమణలు ట్రాఫిక్ కష్టాలను తెచ్చిపెడుతున్నాయి. గతుకులు, గుంతలతో నిండిన రోడ్డును విస్తరించిన నగరపాలకసంస్థ లక్షలాది రూపాయల వ్యయంతో నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టింది. అయితే, అనధికారిక ఆక్రమణలతో రోడ్డు కుచించుకుపోవడంతో పాటు పక్కన వ్యాపారాలతో వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులో బేకర్స్ ఫన్ ఎదుట ఇటీవల నిర్మించిన ముఖ ద్వారం వద్ద ఆక్రమణలతో నిండిపోయింది. బడ్డీకొట్లతో పాటు కొబ్బరి బొండాలను రోడ్డుపైనే పెట్టి విక్రయిస్తుండటంతో రాకపోకలకు విఘాతం కలుగుతోంది. చంద్రమౌళీనగర్ పోస్టాఫీసు వరకు గల ఇదే రహదారి వెంబడి బిర్యానీ పాయింట్లు, టీస్టాల్స్ నిర్వాహకులు రోడ్డును ఆక్రమించుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళలో విద్యాసంస్థల బస్సులు, ఆటోలతో నిండిపోతున్న ఈ రహదారిపై ఆక్రమణల కారణంగా ట్రాఫిక్ చక్రబంధంలో ఉంటోంది. మరోవైపు బేకర్స్ఫన్ ఎదుట రోడ్డుపై వెలసిన ఆక్రమణ వెనుక నిర్మాణంలో భవనానికి సంబంధించిన మెటీరియల్ను రోడ్డుపై వేయడంతో పాడవుతోంది. నెలల తరబడి ఆక్రమణలతో నిండిపోయిన ఈ రహదారి వైపు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగం, ఆక్రమణల నిర్మూలన టీం కన్నెత్తి చూడటం లేదు. మెయిన్ రోడ్డు కార్నర్లో ఆక్రమణలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న శునకాల అందాల పోటీలు

రాజాగారితోటలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గుంటూరు కెనల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వివిధ జాతుల ప్యూర్ బ్రీడ్ డాగ్ కాంపిటీషన్, ఫ్యాషన్షో ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలో అనేక రకాల జాతుల శునకాలు పాల్గొన్నాయి. ఉత్తమ ప్రదర్శన చూపిన పెట్ డాగ్స్లకు సర్టిఫికెట్స్ అందించారు. కార్యక్రమాన్ని క్లబ్ అధ్యక్షుడు పి. రామచంద్రరాజు, కార్యదర్శి ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు



వేసవి తాపానికి శునకానికి ఫ్యాన్



శునకాలకు మెడల్స్ అందజేస్తున్న గవర్నర్ స్పెషల్ చీఫ్ సెక్రటరి సిసోడియా





అదిరేటి డ్రస్లతో ఫ్యాషన్ షోలో విభిన్న జాతుల శునకాలు



మెడల్తో శునకం

ఏపీలో సంక్షేమ పథకాల ఒరవడి కొనసాగింపు

ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్



బుక్లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

నగరంపాలెం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాల ఒరవడి కొనసాగుతుందని ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. 19వ డివిజన్ 61వ సచివాలయ పరిధిలోని ఆర్.అగ్రహారం కావటి శంకరరావు కల్యాణ మండపం వద్ద గడప గడపకు మన ప్రభుత్వం ఆదివారం సాయంత్రం ప్రారంభమైంది. డివిజన్ కార్పొరేటర్ టి.హనుమయమ్మ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి స్థానికులతో మాట్లాడారు. స్థానికంగా ఏవైనా సమస్యలు ఉన్నాయా ? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి సంక్షేమ పథకాల బుక్లెట్లను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా పొందుతున్న లబ్ధిని ప్రజలకు వివరిస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలో ఎవరైనా స్థానికంగా సమస్యలు తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న ప్రజలు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఆయన చెప్పారు. అధికారంలోకి వచ్చిన తరువాత 95 శాతం హామీల్ని అమలు చేశామని పేర్కొన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, ఇంటి పట్టాలు, పెన్షన్లు, వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ ఆసరా, సున్నా వడ్డీ తదితర పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరుతోందని వివరించారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్న ఏకైక సీఎం జగన్ అని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ మరింతగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయనున్నారని తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలోని పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే చెప్పారు. పలువురు కేంద్ర మంత్రులు, ఆయా రాష్ట్రాల మంత్రులు ఏపీని సందర్శించి పథకాల తీరు అమలును అభినందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్చార్జి టెంట్హౌస్ బాబు, 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ పల్లపు మహేష్, నాయకులు యోగేశ్వరరావు, యద్దనపల్లి బాలరాజు, కామిశెట్టి మధు, నాగూర్, బండారు సాంబశివరావు, అనిల్, జాని పాల్గొన్నారు.

అష్టలక్ష్మి మందిరం బ్రహ్మోత్సవాలు ప్రారంభం



అలంకారంలో అష్టలక్ష్మి అమ్మవారు

పాత గుంటూరు: అరండల్పేట నాలుగో లైనులోని శ్రీ అష్టలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనారాయణస్వామి దేవస్థానంలో 28వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు మర్రిపాటి ప్రసాద్ బృందం ఆధ్వర్యంలో గోపూజ, గణపతి పూజ, అఖండ దీపారాధన, కలశ స్థాపన, విశేష పూజలు, నక్షత్ర హారతి, సామూహిక కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అర్చకుడు ప్రసాద్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 27న శ్రీ సిద్ధిబుద్ధి సమేత గణపతి కల్యాణం, 28న ఆదిలక్ష్మి, మార్చి 1న ధాన్యలక్ష్మి, 2న ధైర్యలక్ష్మి, 3న గజలక్ష్మి, 4న సంతానలక్ష్మి, 5న విజయలక్ష్మి, 6న విద్యాలక్ష్మి, 7న శ్రీ ధనలక్ష్మి, 8న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, 9న శ్రీ లక్ష్మీనారాయణ స్వామి కల్యాణాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొనాలని ఆయన కోరారు.

విభిన్న ప్రతిభావంతుడికి కంప్యూటర్ సామగ్రి బహూకరణ



జగదీష్తో ఆర్పీ మిత్ర బృందం

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీనివాసరావుపేట ఆరో లైనులో స్టార్ ఆన్లైన్ సర్వీసెస్ నిర్వహిస్తున్న విద్యావంతుడైన పి.జగదీష్ అనే విభిన్న ప్రతిభావంతుడికి ఆర్పీ మిత్ర బృందం ఆదివారం కంప్యూటర్ టేబుల్, ప్రింటర్, కుర్చీలు, స్టూల్స్ను అందజేసింది. జగదీష్ స్వశక్తిని నమ్ముకుని స్థానికంగా చిన్న దుకాణంలో స్టార్ ఆన్లైన్ సర్వీసు పేరుతో విద్యుత్, టెలిఫోన్ బిల్లులు, మొబైల్, డిష్ రీచార్జ్ తదితర ఆన్లైన్ సేవలు అందిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆయన అభ్యర్థన మేరకు ఆర్పీ మిత్ర బృంద సభ్యులు సామగ్రిని కొనుగోలు చేసి అందించారు. కార్యక్రమంలో ఆర్పీ మిత్ర బృంద వ్యవస్థాపకులు ఉప్పుటూరి రవికుమార్, మాజేటి వరప్రకాష్, సభ్యులు మిట్టపల్లి ఆదినారాయణ, పి. మధు, తాటిమట్ల వెంకటేశ్వరరావు, బొలిశెట్టి శ్రీనివాసరావు, శ్రీనివాస గుప్త, బొలిశెట్టి సురేష్, కారంశెట్టి మురళి, నాగేశ్వరరావు, కె. సుధీర్, టి. కిరణ్, ఎస్.రఘు, పబ్బిశెట్టి రామకృష్ణ, కొప్పురావూరి రామకృష్ణ, ఎస్. అంకమ్మరావు పాల్గొన్నారు.

డాక్టర్ నరేష్బాబుకు ఎక్స్లెన్స్ అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న డాక్టర్ నరేష్బాబు

గుంటూరు మెడికల్: మల్లిక స్పైయిన్ సెంటర్కు చెందిన సీనియర్ స్పైయిన్ సర్జన్, ఆర్థోపెడిక్ సర్జన్స్ సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ జె. నరేష్బాబుకు గోల్డెన్ జూబ్లీ ఎక్స్లెన్స్ అవార్డు లభించింది. జింఖానా ఆడిటోరియంలో శుక్రవారం నుంచి నిర్వహిస్తున్న ఆర్థోపెడిక్ సర్జన్స్ రాష్ట్ర సదస్సు ఆదివారం ముగిసింది. ముగింపు రోజున డాక్టర్ నరేష్బాబుకు అవార్డు దక్కింది. కోవిడ్ అనంతరం స్పైయిన్ సమస్యలు పెరిగాయని డాక్టర్ నరేష్బాబు పేపర్ ప్రజెంటేషన్ చేసినందుకు ఈ అవార్డు ఆయనకు లభించింది. పరిశోధనలు చేసే వైద్యుల్ని ప్రోత్సహించేందుకు ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ అవార్డును అందిస్తోంది. రాష్ట్ర సదస్సులో అవార్డు అందుకున్న డాక్టర్ నరేష్ బాబుకు అసోసియేషన్ నేషనల్ జనరల్ సెక్రటరీ డాక్టర్ నవీన్ ఠక్కర్, స్టేట్ పాస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ వి. ధర్మారావు, ప్రెసిడెంట్ డాక్టర్ వి.వి. నారాయణరావు, గుంటూరుకు చెందిన సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్స్ డాక్టర్ సూరత్ అమర్నాథ్, డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, డాక్టర్ గంటా వరప్రసాద్, డాక్టర్ రమణ యశస్వి, డాక్టర్ సీతారామాంజనేయులు, గుంటూరు ఆర్థోపెడిక్ అసోసియేషన్ నేతలు డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ కంచర్ల రామ్ప్రసాద్, డాక్టర్ శివకుమార్ అభినందనలు తెలిపారు.

భారతి సాంస్కృతిక సంగీత కళావేదిక వార్షికోత్సవం

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో భారతి సాంస్కృతిక సంగీత కళావేదిక 8వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సభకు సంస్థ గౌరవాధ్యక్షుడు చందు సాంబశివరావు అధ్యక్షత వహించారు. వ్యవస్థాపకుడు మిరియాల ప్రసాదరావు ఆధ్వర్యంలో డాక్టర్ కోనేరు సుధాకర్, ఉత్తమ ఎంఈవో చీకటి రవికాంత్కు ఎన్టీఆర్ జీవిత సాఫల్య పురస్కారం అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం పలు చిత్రాల్లోని పాటలను గాయకులు మేకల పురుషోత్తమ్ప్రసాద్, డాక్టర్ సి.వి.ఎస్. రామకృష్ణ, హేమమాలిని, రజని ఆలపించి ప్రేక్షకుల్ని అలరించారు. కాపునాడు జిల్లా అధ్యక్షుడు మిరియాల గోపీకుమార్, డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పల్లె వీధుల్లోకి సాహిత్యం విస్తరించాలి



సభలో మాట్లాడుతున్న గోలి లక్ష్మయ్య

పాత గుంటూరు: పల్లెవీధుల్లో కవి సమ్మేళనాలు పెట్టి సాహిత్యాన్ని గ్రామవీధుల్లో పరిమళింపజేయాలని బాపట్ల జిల్లా డీఎస్పీ గోలి లక్ష్మయ్య అన్నారు. ఆదివారం నవ్యాంధ్ర రచయితల సంఘం, పట్టాభి కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని ఎస్హెచ్వో సమావేశ మందిరంలో కవి మిత్రుల కలయిక-కవి సమ్మేళనం-పుస్తక సమీక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గోలి లక్ష్మయ్య మాట్లాడుతూ పుస్తకం మానసిక వికాసానికి అద్భుతమైన ఐకాన్ లాంటిదని తెలిపారు. నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ మాట్లాడుతూ మంచి పుస్తకాలు మనిషి ఎదుగుదలకు దోహదం చేస్తాయని, నవ్యాంధ్ర రచయితల సంఘం జ్ఞాపికలుగా పుస్తకాలనే అందిస్తుందని తెలిపారు. అరసం పల్నాడు జిల్లా కన్వీనర్ కోసూరి రవికుమార్, యేమినేని వెంకటరమణ, సంఘ జిల్లా అధికార ప్రతినిధి బండికల్లు జమదగ్ని పాల్గొన్నారు. కవి సమ్మేళనాన్ని కాకరపర్తి సుబ్రహ్మణ్యం నిర్వహించారు.

గ్రేస్ లైఫ్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న డెప్యూటీ మేయర్ డైమండ్ బాబు

నెహ్రూనగర్: యువతను జాగృతం చేసి వారిలో సేవా దృక్పథాన్ని పెంపొందించడంలో గ్రేస్ లైఫ్ ఫౌండేషన్ కృషి అభినందనీయమని గుంటూరు నగర డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు తెలిపారు. గుంటూరులోని పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో ఆదివారం గ్రేస్ లైఫ్ ఫౌండేషన్ నాలుగో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ వనమా మాట్లాడుతూ ఫౌండేషన్ డైరెక్టర్ పాల్ చదువుకుంటూ సామాజిక సేవలో భాగస్వామ్యులవ్వడాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రేస్ లైఫ్ ఫౌండేషన్ డైరెక్టర్ పాల్, బహుజన మహాసభ సెంట్రల్ కమిటీ సెక్రటరీ భగత్సింగ్, ధారా సుధాకర్, దాసరి జెన్నిబాబు, కేశవ శివ నాగన్న పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపునకు ఎగ్జిబిషన్లు దోహదం

ఎమ్మెల్యే ముస్తఫా, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



విద్యార్థుల ప్రదర్శన తిలకిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, కన్న మాస్టారు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో సృజనాత్మకత, ప్రతిభను వెలికి తీయడంలో సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదం చేస్తాయని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహ్మద్ ముస్తఫా, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, డొక్కా మాణిక్య వరప్రసాద్ తెలిపారు. ఆదివారం పాత గుంటూరులోని కన్న ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలుగా నగరంలోని పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యాబోధన అందించడంలో కన్న మాస్టారు విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయన వద్ద విద్యను అభ్యసించిన ఎంతో మంది పూర్వ విద్యార్థులు దేశ, విదేశాలలో స్థిరపడ్డారని పేర్కొన్నారు. విద్యాసంస్థల డైరెక్టర్ కన్న మాస్టారు మాట్లాడుతూ సోమ, మంగళవారాల్లోనూ ప్రదర్శన కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పర్యావరణ, భౌతిక, రసాయన, మానవ నిర్మాణ శాస్త్రాలతో పాటు, మ్యాథమెటిక్స్, జువాలజీ తదితర అంశాలు, నూతనంగా ప్రవేశపెట్టిన వందే భారత్ ఎక్స్ప్రెస్ రైలు, అతిపెద్ద విమానాశ్రయం, మేధస్సుకు పదునుపెట్టే విధంగా విద్యార్థులు తయారుచేసిన ప్రదర్శనలు సందర్శకుల్ని ఆశ్చర్యంలో ముంచెత్తాయి. స్వాతంత్ర సమరయోధుల వేషధారణలతో చిన్నారులు, తెలుగు సంస్కృతి సంప్రదాయాల్ని ప్రతిబింబించేలా రామాయణ, మహాభారత గాథలతో కూడిన శివపార్వతుల వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకురాలు నూరి ఫాతిమా, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణమాచారి, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

దాడి కేసులో ఐదుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్హెచ్ఓ శ్రీనివాసరెడ్డి, వెనుక నిందితులు

గుంటూరు ఈస్ట్: దాడి కేసులో ఐదుగురిని కొత్తపేట పోలీసులు అరెస్టు చేయగా ఆరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. ఎస్హెచ్ఓ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం గాజుల రాజు రాజాగారితోట 2వ లైను వద్ద మద్యం మత్తులో ద్విచక్ర వాహనం పైనుంచి కింద పడ్డాడు. అక్కడ ఉన్న గుర్రం శ్రీనివాసరెడ్డి , కంపా రాంబాబు అది చూసి నవ్వారు. దీంతో గాజుల రాజు అక్కడి నుంచి వెళ్లి మరో ఐదుగురిని తీసుకుని వచ్చి గదిలో నిద్రిస్తున్న శ్రీనివాసరెడ్డి, రాంబాబుపై దాడి చేశారు. వారి వద్ద ఉన్న బంగారు గొలుసు, మూడు సెల్ఫోన్లు, రూ. 7,500తో పాటు స్మార్ట్ వాచ్ లాక్కుని వెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు నిందితులైన రాజాగారి తోటకు చెందిన గాజుల రాజు, సంజీవయ్య నగర్కు చెందిన షేక్ ముషీర్ అలీ, చిలకా వారి వీధికి చెందిన షేక్ రసూల్, రాజాగారి తోటకు చెందిన గాజుల గణిరాజు, ఓ మైనర్ బాలుడిని అరెస్టు చేశారు. వారి నుంచి వస్తువులతో పాటు నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో జక్కా అవినాష్ పరారీలో ఉన్నాడు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

నెహ్రూనగర్: దాచేపల్లిలో గరికపాటి కోటేశ్వరరావును అత్యంత దారుణంగా హత్య చేసి, తగలబెట్టిన నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవడంతో పాటు, నిందితుడ్ని ఉరి తీయాలని ఆయన డిమాండ్ చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్యపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. దేవాపురం 5వ లైనులో నివసించే బూదాల బాలరాజు (40)తాపీ పనులు చేసి జీవనం సాగిస్తుంటాడు. ఇటీవల తీవ్రమైన కడుపునొప్పితో బాధ పడుతున్నాడు. దీంతో శనివారం ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యాన్కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.